ఆర్టీపీపీ కాలుష్యంతో అన్నదాత విలవిల

- కొసినేపల్లెలో పంటలు బూడిదమయం
- ఆర్టీపీపీ అధికారుల తీరుతో రైతులకు కన్నీళ్లు
- కాలుష్య నివారణ చర్యలు శూన్యం


ఆర్టీపీపీ పక్కనే సాగులో కొసినేపల్లె పంటపొలాలు

ముద్దనూరు : రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టు సమీపంలో ఉన్న కొసినేపల్లె గ్రామంలో అధికశాతం గ్రామస్తులకు వ్యవసాయమే జీవనాధారం. చీనీచెట్టు, అన్నిరకాల కూరగాయాలు సాగుచేస్తున్నారు. అయితే పక్కనే వున్న ఆర్టీపీపీ రైతన్నల పాలిట శాపంగా పరిగణిస్తోంది. సాగుచేసిన ప్రతిపంట కాలుష్యంతో దెబ్బతిని రైతులు నష్టాలపాలవుతున్నారు.

బూడిత కాలుష్యంతో పంటలకు తీవ్ర నష్టం

మండలంలోని కొసినేపల్లె గ్రామంలో ఆర్టీపీపీ చిమ్నీల నుంచి వెలుబడే బూడిత కాలుష్యంతో గ్రామంలోని అన్నదాతలు విలవిలలాడుతున్నారు. ఆర్టీపీపీకి సమీపంలోనే ఈ గ్రామం వుండటంతో చిమ్నీల లోనుంచి వెలుబడే వ్యర్థ బూడిద ప్రజలకు ఇబ్బందికరంగా మారింది. పచ్చని సాగుపై తెల్లని బూడిద పొడి కాలుష్యంతో దిగుబడిలేక పంటలు కళ్ళముందే నాశనమవుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆశతో లక్షాలది రూపాయలు పంటలపై పెట్టుబడులు పెట్టి సాగుచేస్తున్నామని, అయితే ఆర్టీపీపీ నుంచి వచ్చే బూడిదతో పంటలు బుగ్గిపాలవుతున్నాయని, ఎన్నో ఏళ్ళ నుంచి సాగుచేస్తున్న చీనీ చెట్లు పూతదశ రాలిపోతోందని రైతులు కన్నీళ్ళపర్యంతమవుతున్నారు.


చీనీచెట్ల ఆకులపై పడిన కాలుష్యం

నిర్లక్ష్య ధోరణిలో ఆర్టీపీపీ అధికారులు

తమ గ్రామంలో ఆర్టీపీపీ బూడిద కాలుష్యంతో పంటలు చేతికిరాక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని గతంలో పలుసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్ళినట్లు రైతులు తెలిపారు. అయితే ఆర్టీపీపీ అధికారులు నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నారని, భవిష్యత్‌లో అధికారులు చర్యలు తీసుకోకపోతే ఉద్యమించాల్సి వస్తుందని అన్నదాతలు హెచ్చరిస్తున్నారు.

కాలుష్య నివారణ చర్యలు చేపట్టకపోతే ఫిర్యాదు చేస్తాం



ఆర్టీపీపీ చిమ్నీల నుంచి వెలుబడే బూడిద కాలుష్యం గ్రామంలోని పంటలను నాశనం చేస్తున్నాయి. ఎన్నోసార్లు రైతులు ఆర్టీపీపీ అధికారుల దృష్టికి తీసకెళ్ళినా వారు స్పందించడం లేదు. ఆర్టీపీపీ కాలుష్యంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదుచేస్తాం.

– సుధాకర్‌రెడ్డి, రైతు, కొసినేపల్లె

ఆర్టీపీపీ బూడిదతో పంటలు నాశనమవుతున్నాయి



ఆర్టీపీపీ పరిశ్రమ పక్కనే నా పొలం వుంది. ఆర్టీపీపీ నుంచి నిత్యం నా పంటలపై బూడిద పడుతోంది. ఈ కాలుష్యంతో నాతోటలో సాగులో వున్న చీనీ చెట్లు దెబ్బతిని ఆర్థికంగా నష్టపోతున్నాను. చీనీ, కూరగాలు సాగుచేస్తున్నాను. పంటలసాగుపై బూడిద పడకుండా చర్యలు తీసుకోవాలి.

– బత్తల పెద్ద గురవయ్య, రైతు, కొసినేపల్లె

వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్లుగా గంగాధర్‌రెడ్డి, హాఫీజ్



పులివెందుల టౌన్ : వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్లుగా క్లస్టర్–1 హాలు గంగాధర్‌రెడ్డి, క్లస్టర్ 2 హాఫీజ్‌లు నియమితులయ్యారు. ఈ మేరకు వారికి అధిష్టానం ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాకు అప్పగించిన బాధ్యతలు నిక్కచ్చిగా నిర్వర్తిస్తామని, మాకు ఈ పదవి బాధ్యతలు అప్పగించినందుకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, నియోజవర్గ ఇన్‌చార్జి వైఎస్ భాస్కర్‌రెడ్డి, మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, వైఎస్ఆర్సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు.

ఆలయంలో అన్నదానం

పులివెందుల టౌన్ : పట్టణంలోని పాతమార్కెట్ ఆంజనేయస్వామి ఆలయంలో రెండు వారాలుగా అన్నదాన కార్యక్రమాన్ని దాతల సహకారంతో ప్రతిరోజు మధ్యాహ్నం నిర్వహిస్తున్నామని ఆలయ నిర్వాహకుడు చలమారెడ్డి తెలిపారు.

క్లుప్తంగా

నేడు కల్యాణోత్సవం


ప్రత్యేక అలంకారంలో ఉత్సవ మూర్తులు

వేంపల్లె : స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో ఉన్న శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం శ్రీ గోదాదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ విశ్వనాథ రెడ్డి తెలిపారు. ఆలయ అర్చకులు అచ్యుత్ నారాయణాచార్యుల నేతృత్వంలో భక్తుల సహకారంతో 13న భోగి రోజున సాయంత్రం 4 గంటలకు స్వామి వారి కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కోడి పందేలకు అనుమతి లేదు


కొత్తపల్లెలో ప్రజలకు కోడి పందేలు ఆడకూడదని అవగాహన కల్పిస్తున్న పోలీసులు

పులివెందుల రూరల్ : కోడి పందేలకు ఎటువంటి అనుమతులు లేవని పులివెందుల ఎస్ఐ నారాయణ తెలిపారు. ఆదివారం మండలంలోని కొత్తపల్లెలో ఆయన తన సిబ్బందితో పర్యటించారు. ఎవరైన కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సంక్రాంతి పండుగను సంతోషంగా జరుపుకోవాలన్నారు. గ్రామాలలో కోడి పందేలు ఆడుతున్నట్లు సమాచారం అందితే వెంటనే గ్రామాలకు చేరుకుని వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు

వేముల : సంక్రాంతి పండుగను ప్రజలందరు సంతోషంగా జరుపుకోవాలని ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ సంక్రాంతి పండగ పేరుతో కోడి పందేలు నిర్వహించ రాదన్నారు. ఎవరైన కోడి పందాలు నిర్వహిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. సాంప్రదాయ క్రీడల పేరుతో ఎలాంటి అసాంఘీక కార్యాక్రమాలకు పాల్పడవద్దన్నారు. కోడి పందాలు, పేకాట నిర్వాహకులపై గట్టి నిఘా ఉంచామన్నారు.

కోడిపందేల నిర్వహణకు సర్వం సిద్ధం


కోడిపందేల నిర్వహణకు సర్వం సిద్ధం చేసిన టీడీపీ నాయకులు

లింగాల : మండలంలోని మురారిచింతల గ్రామంలో సంక్రాంతి పండుగ సందర్భంగా కోడి పందేల నిర్వహణకు సర్వం సిద్ధం చేశారు. పులివెందుల రూరల్ సీఐ ఎన్వీ రమణను వివరణ కోరగా కోడిపందేల నిర్వహణకు ఎటువంటి పర్మిషన్ ఇవ్వలేదని అన్నారు. అయితే టీడీపీ నాయకులు కోడిపందాల నిర్వహణకు సర్వం సిద్ధం చేశారు. పోలీసుల అనుమతి లేకుండా కోడిపందాలు పేకాట వంటి అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. అయినప్పటికీ కోడిపందాల నిర్వహణకు సర్వం సిద్ధం చేశారు. సోమవారం నుంచి మూడు రోజులపాటు కోడిపందాలు నిర్వహిస్తారని స్థానికులు తెలిపారు. దీనిపై పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సి ఉంది.

పార్టీ బలోపేతానికి కృషి చేస్తా


భాస్కర్‌రెడ్డి

పులివెందుల రూరల్ : మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడిగా మరోసారి అజ్జుగుట్ట భాస్కర్‌రెడ్డి ని అధిష్టానం ప్రకటించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి, కడప ఎంపీ వై ఎస్ అవినాష్ రెడ్డికి, వైఎస్ కుటుంబ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మండల పరిధిలోని గ్రామాలలో పార్టీని బలోపేతం చేసేందుకు తన వంతు కృషి చేస్తామన్నారు.

ఎర్రగుంట్లలో ట్రాఫిక్ అంతరాయం

ఎర్రగుంట్ల : పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలిలో ఆదివారం ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. నిరంతరం వాహనాల రద్దీతో కూడలిలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా మారింది. కూడలిలో అక్రమాలను అధికారులు తొలగించినా మళ్లీ బండ్లు పెట్టుకుంటున్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా కూడలిలో ఆదివారం రాత్రి ఒక్క పోలీస్ కూడా లేకపోవడంతో వాహనాలు కిక్కిరిసి ట్రాఫిక్ ఏర్పడింది. సుమారు అర్ధగంట పాటు వాహనాలు ఎటు పోలేదు. రోడ్డుకు అనుకుని బైక్‌లు ఉంచడంతో ట్రాఫిక్ సమస్య మొదలైంది.

పార్టీ కోసం కలిసికట్టుగా పనిచేయాలి


నూతన జిల్లా కమిటీలో పదవులు పొందిన నాయకులను సన్మానించిన ఎమ్మెల్సీ

జమ్మలమడుగు : జిల్లా, మండలస్థాయిలో పదవులు పొందిన నాయకులందరూ గ్రామ మండల నాయకులతో కలిసికట్టుగా పనిచేయాలని ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి తెలిపారు. ఆదివారం జిల్లాస్థాయి, మండలస్థాయిలో పదవులు పొందిన నాయకులకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అనంతరం ఆయన వారితో సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు.

వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తలను గుర్తించి వారికి పదవులను కట్టబెట్టడం జరిగింది. భవిష్యత్తులో పార్టీని అధికారంలోనికి తీసుకురావటం కోసం అందరం కలిసికట్టుగా పనిచేద్దామన్నారు. భవిష్యత్తులో పార్టీ కోసం పనిచేసే కార్యకర్తలకు, నాయకులకు రాష్ట్రస్థాయిలో, జిల్లా స్థాయిలో పార్టీ పదవులు వస్తాయన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను మనమందరం కలసికట్టుగా ప్రజల్లోకి తీసుకుపోవాలన్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రజలకు జరిగిన మేలు వివరించడంతోపాటు ప్రస్తుత ప్రభుత్వం గురించి తెలియపరచాలన్నారు. అనంతరం జిల్లా ఉపాధ్యక్షుడు పోచిరెడ్డి రమణారెడ్డి, అధికార ప్రతినిధి ఎస్.మోహన్‌రెడ్డి, జనరల్ సెక్రెటరీ పి.శివారెడ్డి, జిల్లా సెక్రెటరీ మార్బుల్ శ్రీను, జిల్లా మున్సిపల్ విభాగ అధ్యక్షుడు హృషికేశవరెడ్డి, పట్టణ అధ్యక్షుడు పోరెడ్డి మహేశ్వరరెడ్డి, మండల అధ్యక్షుడు ధన్నవాడ మహేశ్వర రెడ్డి, ఎం.విష్ణువర్ధన్‌రెడ్డిలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పి.గిరిధర్‌రెడ్డి, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ శివగుర్విరెడ్డి, సర్పంచ్ జగదీశ్వర రెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, బోనం సురేష్, యోబు తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపైకి మురుగునీరు రాకుండా చూడాలి


సిమెంటు రోడ్లపైకి చేరిన మురుగునీరు

వేంపల్లె : వేంపల్లి పంచాయతీ పరిధిలో ఉన్న సిమెంటు రోడ్లపైకి మురుగునీరు రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. ఆదివారం స్థానిక ఎంపీటీసీలు కటిక చంద్రశేఖర్, మణి గోపాల్‌రెడ్డిలతో కలిసి ప్రజలు సిమెంట్ రోడ్లపై పారుతున్న మురుగు నీటిని పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజలు మాట్లాడుతూ రోజు ఇలా మురుగునీరు రోడ్లపై పారుతుంటే ఏలా తొక్కుకుంటూ ఇళ్లలోకి వెళ్లాలా అని ప్రశ్నించారు. డ్రైనేజీ కాలువల్లో చెత్తాచెదారాలు తీయక పోవడంతో అవి పేరుకు పోయి మురుగు నీరంతా రోడ్లపైకి వస్తుందన్నారు. మురుగునీరు రోడ్లపైకి రావడంతో దుర్గంధం వెదజల్లుతోందన్నారు. వృద్ధులు, చిన్నపిల్లలు జ్వరాలు, దగ్గు, జలుబులతో అల్లాడుతున్నారన్నారు. పంచాయతీ కార్యాలయంలో చాలాసార్లు ఫిర్యాదు చేసినా పంచాయతీ సిబ్బంది పట్టించుకోవడం లేదన్నారు. వీధుల్లోని రోజువారి చెత్తా చెదారాలు కూడా సక్రమంగా తీసుకెళ్లకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని తెలిపారు. వేంపల్లి పంచాయతీ పరిధిలో అన్ని వీధులు ఇదే పరిస్థితి ఉందన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం


అప్పటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

కొండాపురం : స్థానిక జెడ్పీ ఉన్నతపాఠశాల ఆవరణలో 2008–09 పదవ తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వవిద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు విద్య నేర్పిన గురువులను గుర్తు చేసుకుంటూ అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు, అప్పటి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వివేకానందుడి బోధనలు యువతకు ఆదర్శనీయం


వేంపల్లెలో స్వామివివేకానంద చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్

వేంపల్లె : స్వామి రామకృష్ణ ప్రధాన శిష్యుడైన స్వామి వివేకానందుడు మానవతా సూత్రాలను హైందవ మత సంస్కరణకు ఆయన చూపిన దారి యావత్ ప్రపంచ యువతకంతా ఆదర్శనీయమని స్థానిక వైఎస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చెరసాల యోగాంజనేయులు తెలిపారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ స్వామి వివేకానందుడు హైందవమత సేవకు మానవాళి మనుగడకు చూపిన చొరవ ఎంతో ఆదర్శనీయమని నేటి యువత అంతా వాటిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. పశ్చిమ దేశాలు, తూర్పు దేశాల సంస్కృతి అనగా భారతీయ సంస్కతిని తక్కువ చేసి చూపిస్తున్న సమయంలో చికాగో నగరంలో స్వామి వివేకానందుడు పర్యటించి ప్రవచించిన తీరు యావత్ ప్రపంచ జాతిని మేల్కొల్పిందని హైందవ జాతి గొప్పతనాన్ని చాటిందని వాటిని మనం నిరంతరం గుర్తించుకోవాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకేతర బంద నాయకుడు మహేష్‌రావు, తదితరులు పాల్గొన్నారు. అలాగే స్వామి వివేకానంద ఆశయాలను గౌరవిస్తూ ప్రతి యువకుడు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలాని వేంపల్లె ఆర్యవైశ్య అఫీసియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (అవోపా) ఉపాధ్యక్షుడు రాయవరం ద్వారకానాథ్ తెలిపారు. ఆదివారం స్వామి వివేకానంద జయంతి సందర్భంగా స్థానిక శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థాన కార్యాలయంలో అవోపా ఆధ్వర్యంలో ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం శ్రీరామ్‌రఘునాథ్ సహకారంతో ప్రభుత్వాస్పత్రిలో రోగులకు బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అవోపా, అవోపా మహిళా విభాగ్ సభ్యులు పాల్గొన్నారు.


ఎర్రగుంట్లలోని వివేకానందస్వామి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న రామాంజనేయరెడ్డి

ఎర్రగుంట్లలో..

ఎర్రగుంట్ల : పట్టణంలోని జాతీయ యువజన దినోత్సవం పురస్కరించుకుని వివేకానందస్వామి జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఉన్న శ్రీ వివేకానంద స్వామి విగ్రహం వద్ద మండల విద్యాధికారి–2 ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామాంజనేయ రెడ్డి ఘనంగా నివాళులర్పించారు.

చక్రాయపేటలో..


చక్రాయపేటలో పారిశుద్ధ్య కార్మికులకు వస్త్రాలను అందజేస్తున్న డాక్టర్ బయారెడ్డి

చక్రాయపేట : స్వామి వివేకానందుడి ఆశయాలు యువతకు ఆదర్శమని పలువురు వక్తలు తెలిపారు. ఆదివారం నాగలగుట్టపల్లెలోని గ్రామీణ గ్రంథాలయం వద్ద వివేకానందుడి 162వ జయంతి వేడుకలను బీజేపీ నేషనల్ కౌన్సిల్ మెంబర్ రామచంద్రా రెడ్డి ఆధ్వర్యంలో ఘణంగా నిర్వహించారు. అలాగే గండి తపోవనం ప్రేమానందస్వామి శిష్యులు వివేకానందుడి విగ్రహం వద్ద పూజలు నిర్వహించారు. పారిశుధ్య కార్మికులకు వస్త్రాలను బహూకరించారు. కార్యక్రమంలో డాక్టర్ బయారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంగల శశిభూణరెడ్డి, అడ్వకేట్ మోపూరి రామాంజనేయరెడ్డి, ఆపస్ సంఘ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయప్రసాద్, మాజీ జడ్పీటీసీ రాధాకృష్ణయ్య, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పెండ్లిమర్రిలో..


పెండ్లిమర్రిలో స్వామి వివేకానంద చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న బీకేఎస్ నాయకులు

పెండ్లిమర్రి : స్వామి వివేకానంద జయంతి వేడుకలు పెండ్లిమర్రి వీరభద్రస్వామి దేవాలయంలో ఆదివారం భారతీయ కిసాన్ సంఘ్ మండల కమిటీ అధ్యక్షుడు చింతా గంగిరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. ఆయన మాట్లాడుతూ నేటి యువతకు ఆయన ఆదర్శమన్నారు. బీకేఎస్ నాయకులు ఓబుల్‌రెడ్డి, వెంకటరెడ్డి, బీజేపీ నాయకులు బాలగురవయ్య పాల్గొన్నారు.

మండల అధ్యక్షుడిగా నాగేళ్ల సాంబశివారెడ్డి



వేముల : వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మెరకు వేముల మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడిగా రెండవసారి నాగేళ్ల సాంబశివారెడ్డి నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. మండల, గ్రామస్థాయి నాయకుల సహకారంతో పార్టీని బలోపేతం చేస్తామన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ఆనందంగా.. ఆత్మీయంగా


అప్పటి ఉపాధ్యాయులతో పూర్వవిద్యార్థులు

తొండూరు : స్థానిక ఉన్నత పాఠశాలలో 1983–84 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించుకుని సంబరపడ్డారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ బాగోగులు అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్నం విందు భోజనం ఆరగించి ఆటపాటల్లో మునిగి తేలారు. నాటి ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో విద్యార్థులు, నాటి గురువులు పాల్గొన్నారు.

ప్రజాదరణ పొందిన గొప్ప వ్యక్తి అభిషేక్‌రెడ్డి

పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణంలోని అంబకపల్లె రోడ్డులో ఉన్న వైఎస్ మధురెడ్డి నివాసంలో ఆదివారం వైఎస్ అభిషేక్‌రెడ్డి జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులతో కలిసి సమావేశం నిర్వహించారు. వైఎస్ అభిషేక్‌రెడ్డితో ఉన్న అనుభవాలను వారు తెలియజేశారు. ఈ సందర్భంగా కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి మాట్లాడుతూ చిన్న వయస్సులో ప్రజాదరణ పొందిన గొప్ప వ్యక్తి అభిషేక్‌రెడ్డి అని అన్నారు. వైఎస్సార్‌సీపీ వైద్య విభాగపు ప్రధాన కార్యదర్శిగా పదవి పొందినప్పటి నుంచి ప్రజలలో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించడంలో ఎల్లప్పుడూ ముందుంటూ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన వ్యక్తి అని అన్నారు. చిన్న వయస్సులోనే ఆయన మృతి చెందడం చాలా బాధాకరమన్నారు. అనంతరం మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, పారిశ్రామికవేత్త వైఎస్ ప్రకాష్‌రెడ్డి, తొండూరు మండల ఇన్‌చార్జి వైఎస్ మధురెడ్డి, భార్య మాధవి, కుమారుడు అభినవ్‌రెడ్డి, అభిషేక్‌రెడ్డి భార్య సౌఖ్య కుమార్తెలు అక్షయ, ఆకర్షలు చిత్రపటానికి పూలమాలలు వే సి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్ కుటుంబ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి


వైఎస్ అభిషేక్‌రెడ్డి చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కో ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి


వైఎస్ అభిషేక్‌రెడ్డి చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్ ప్రకాష్‌రెడ్డి, అభిషేక్‌రెడ్డి భార్య, కుమార్తెలు


వైఎస్ అభిషేక్‌రెడ్డి చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న డాక్టర్ ఇసీ సుగుణమ్మ


మాట్లాడుతున్న వైఎస్ అభిషేక్‌రెడ్డి సోదరుడు వైఎస్ అభినవ్‌రెడ్డి, కొండారెడ్డిలు


మాట్లాడుతున్న అభిషేక్‌రెడ్డి మేనత్త మంజుల

ఘనంగా పూర్వ ఉపాధ్యాయులకు సన్మానం


అప్పటి ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పూర్వపు విద్యార్థులు

జమ్మలమడుగు : 27 సంవత్సరాల తర్వాత పతంగే రామన్నరావు ఉన్నతపాఠశాలలో పదవ తరగతి విద్యార్థులు కలుసుకుని తమ పూర్వపు ఉపాధ్యాయులను కలసి వారిని ఘనంగా సన్మానించారు. ఆదివారం పట్టణంలోని అన్విత ఫంక్షన్ హాల్‌లో 1997 సంవత్సరం బ్యాచ్ విద్యార్థులు తమ అనుభూతులను పంచుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులు శ్యాంసుందర్, శేషారెడ్డి, రసూల్, ప్రదీప్, మోహన్, మస్తాన్‌బీ, ప్రమీల తదితరులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వపు విద్యార్థులు సాంస్కృతిక నృత్యకార్యక్రమాలను నిర్వహించారు.

వైఎస్ఆర్‌సీపీ జనరల్ సెక్రటరీకి సన్మానం

చక్రాయపేట : వైఎస్ఆర్‌సీపీ పులివెందుల నియోజకవర్గ జనరల్ సెక్రటరీగా నియమితులైన బందలకుంట ఈశ్వర్‌రెడ్డిని ఆదివారం గ్రామస్తులు ఘణంగా సన్మానించారు. పార్టీ పదవిని చేపట్టాక ఆయన స్వగ్రామం బురుజుపల్లెకు వచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి కార్యకర్తకు అందుబాటులో ఉంటూ పార్టీ పటిష్టత కోసం కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ గంగయ్య, పార్టీ నాయకులు పాల్గొన్నారు.